# ఆరోగ్య ప్రాప్తిరస్తు





రెల్లి వీధి-జబ్బర్‌తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పేదలు ఎవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.




**మహారాణిపేట:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీలు) పేదల వైద్యానికి భరోసాగా నిలిచాయి. జీవీఎంసీ ప్రతి వార్డులో వీటిని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి అన్ని రకాల వైద్య సేవలు తీసుకొచ్చారు. 37వ వార్డు రెల్లివీధి-జబ్బరతోటలోని ఆరోగ్య కేంద్రాన్ని రూ.63 లక్షలతో సకల సదుపాయాలతో తీర్చిదిద్దారు. ఆధునిక సౌకర్యాలు, వైద్య పరికరాలు, వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఒక వైపు వైద్యులను రోగులకు అందుబాటులో ఉంచుతూ.. మరో వైపు రోగులకు అవసరమైన వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**కార్పొరేట్ లుక్**

నాడు అధ్వాన స్థితిలో ఉన్న రెల్లివీధి-జబ్బరతోట యూపీహెచ్‌సీ.. నేడు కార్పొరేట్ ఆస్పత్రిగా దర్శనమిస్తోంది. ఒకప్పుడు కొన్ని వైద్య పరీక్షలు, కొన్ని మందులు మాత్రమే అందుబాటులో ఉండేవి. గతంలో ఈ భవనంలో మ్యాక్స్ సెంటర్ ఉండేది. ఇప్పుడు ఈ ఆస్పత్రిని ఆధునికీకరించి పూర్తిగా లుక్ మార్చడంతో అన్ని సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

- ప్రజల వైద్యానికి ప్రభుత్వ భరోసా
- పేదలకు అందుబాటులో ఆరోగ్య కేంద్రాలు
- పుష్కలంగా మందులు, అన్ని రకాల పరీక్షలు

**వైద్య నిపుణులు, సేవలు**

- రెల్లివీధి-జబ్బరతోట ఆరోగ్య కేంద్రంలో ఓపీ కోసం రోజూ 80 నుంచి 100 మంది వరకు రోగులు వస్తున్నారు.
- ఒక ఎంబీబీఎస్ డాక్టర్ నిత్యం అందుబాటులో ఉంటారు.
- ప్రతి రోజూ ఒక స్పెషలిస్ట్ డాక్టర్ వైద్య సేవలందిస్తారు.
- సోమవారం ఈఎన్‌టీ సేవలు, మంగళవారం చిన్నపిల్లల వైద్యుడు, గురువారం సాధారణ వైద్యుడు, ఎముకల వైద్యుడు, శుక్రవారం ప్రసూతి, స్త్రీ, శ్వాసకోశ వైద్య నిపుణులు, శనివారం చర్మవ్యాధి నిపుణులు అందుబాటులో ఉంటున్నారు.
- ఈ యూపీహెచ్‌సీలో 63 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు పేదలకు ఉచితంగా అందిస్తున్నారు.



యూపీహెచ్‌సీలో వైద్య పరికరాలు



యూపీహెచ్‌సీలో వైద్య సేవలందిస్తున్న వైద్యురాలు



- ప్రతి సోమవారం నుంచి శనివారం వరకు వైద్యులు, స్పెషలిస్ట్‌లు విధుల్లో ఉంటారు.
- ఆదివారం ఇతర వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



కార్పొరేట్ లుక్‌లో ఆరోగ్య కేంద్రం

### పేదలకు సంపూర్ణ వైద్యం



ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. పేదలకు సంపూర్ణ వైద్యం అందించేందుకు యూపీహెచ్‌సీలను అందుబాటులోకి తెచ్చింది. వైద్యుడు, సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉంటున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇస్తున్నారు.

– చెన్నా జానకీరామ్, కార్పొరేటర్, 37వ వార్డు

### చెంతనే ఆరోగ్య కేంద్రంతో మేలు



నాకు తరచూ జ్వరం వచ్చి తగ్గుతోంది. పలు ప్రాంతాల్లో వైద్యులకు చూపించినా ఫలితం లేదు. రెల్లివీధి యూపీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించగా పరీక్షలు చేశారు. ఇప్పుడు జ్వరం రావడం లేదు. నేను ఇక్కడే నివసిస్తుండటం వల్ల యూపీహెచ్‌సీ అందుబాటులో ఉంది.

– రెయ్యి డేవిడ్‌రాజు, రెల్లి వీధి

### అందుబాటులో వైద్యులు



గతంలో ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు, మందులు ఉండేవి కావు. ఇప్పుడు యూపీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉచితంగా మందులు అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం చాలా మంచిది.

– కాసరావు వాసు, జాలరిపేట

### వైద్య సేవలు బాగున్నాయి



నేను వెన్నునొప్పి, చక్కెర వ్యాధితో బాధపడుతున్నాను. దీని కోసం ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా.. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి తగు సలహాలు ఇచ్చారు. మందులు ఉచితంగా అందడం చాలా సంతోషంగా ఉంది. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు చాలా బాగున్నాయి.

– పుచ్చకాయల సుమలత, జాలరిపేట

## క్లుప్తంగా

### బోట్ల ప్రమాద బాధితులను ఆదుకోవాలి

**డాబాగార్డెన్స్:** ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితులకు వెంటనే పరిహారం అందించి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు నేతృత్వంలో పీసీసీ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, ఆ పార్టీ రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ కదిరి జగన్నాథం తదితరులు పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు రామారావు, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

### కాలుష్య రహిత విశాఖకు సహకరించండి



ఆటోలో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

**డాబాగార్డెన్స్:** నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా మహ్మద్ షాదిక్ జన్మదిన వేడుకలు



అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ షాదిక్

**జగదాంబ:** జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ షాదిక్ తన పుట్టిన రోజు వేడుకలను సోమవారం కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. వార్డు కార్యాలయంలో కేక్ కట్‌చేసి విందు భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా పాపా హోంలో చిన్నారులకు భోజనాలు అందించారు. ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన బోటు ప్రమాదంలో వల్ల పలు సేవా కార్యక్రమాలను సాదిక్ వాయిదా వేశారు.

### అలరించిన సంగీత విభావరి

**సీతంపేట:** విశాఖ పౌర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో గీత్ సంగీత్ పేరిట సంగీత విభావరి నిర్వహించారు. పలువురు గాయనీ గాయకులు హుషారైన పాటలు పాడి అలరించారు. వారోత్సవాల్లో భాగంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శన, పిల్లలకు, పెద్దలకు క్విజ్, చిత్ర ప్రదర్శన, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, కవి సమ్మేళనం, చర్చా గోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, గ్రంథపాలకురాలు దుర్గారాణి పాల్గొన్నారు.



# మార్మోగిన శివ నామస్మరణ



సింగ్ హోటల్ జంక్షన్ ఓంకార ఆలయంలో మహాశివునికి పూజలు చేస్తున్న అర్చకుడు



ఓంకార ఆలయం వద్ద కార్తీక మాస తొలి సోమవారం సందడి



బౌదరారోడ్డు శివాలయంలో ఘంట స్థంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

**డాబాగార్డెన్స్:** శివనామ స్మరణతో శివాలయాలు మార్మోగాయి. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సూర్యాబాగ్ విశ్వేశ్వరాలయంలో వేకువజాము 4 గంటల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. స్వామికి ఏకవారాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అస్సాంగార్డెన్స్ శ్రీశివరామకృష్ణ దేవస్థానం, బౌదరారోడ్డులోని మురళీధర వీధి శ్రీపంచముఖేశ్వర దక్షిణామూర్తేశ్వర దేవాలయం, సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రం సమీపాన ఉన్న ఉమా రామలింగేశ్వరాలయం భక్తులతో కళకళలాడాయి. 31వ వార్డు సింగ్ హోటల్ జంక్షన్ సమీపాన ఓంకార ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గొల్లలపాలెం శెట్టిబలిజ సంఘం వద్ద ఉన్న సాయి రామలింగేశ్వరాలయం, ఏవీఎన్ కాలేజ్‌లోని శివాలయంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు.



శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



శివయ్య పూజల్లో పాల్గొన్న భక్తులు

**ఆలయాలకు కార్తీక శోభ**

**అల్లిపురం:** కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. డీబీకే రైల్వే క్వార్టర్స్‌లోని శ్రీ భవానీ శంకరగణపతి ఆలయం, బౌదరా రోడ్డులోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, మురళీధర వీధిలోని పంచముఖేశ్వరస్వామి దేవాలయంలో విశేషంగా పూజలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవంలో భక్తులు విశేష పూజలు నిర్వహించి, దీప దర్శనం చేసుకుని తరించారు. దేవస్థానం ఈవో రమాబాయ్, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నీలాపు రమణారెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు.

# ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాలల ఉపాధ్యాయులు



విజేతలతో ప్రముఖులు

**డాబాగార్డెన్స్:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యువ సమన్వయ అధికారి జి.మహేశ్వరరావు, విద్యాశాఖ సహాయ సంచాలకుడు డి.చిన్నకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాజ హిత అధ్యక్షుడు కేవీఎస్ నరసింహం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, బీఈడీ ట్రైనింగ్ స్టూడెంట్స్, డీసీఎల్ సిబ్బంది, అధిక సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.

**బాలల శాఖ గ్రంథాలయంలో..**

జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో ఆర్‌సీఎం, ఎంవీడీఎం, ఏవీఎన్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎల్.రమణ, జి.పుష్పలత, జీవీ పాతిమారాణి, వి.శ్రీలలిత, ఎంవీ భానుమతి, కేకే మహాలక్ష్మి తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

**మహిళా కళాశాలలో..**

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి , కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ ధరణి, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ లైబ్రరీని తిలకిస్తున్న మహిళా కళాశాల విద్యార్థినులు

# బస్సు యాత్రను జయప్రదం చేద్దాం

**అల్లిపురం:** ఈ నెల 22న నియోజకవర్గంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ పిలుపునిచ్చారు. వార్డులో ఆర్పీలు మహిళా సంఘాలు, డ్వాక్రా గ్రూపులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. సమావేశంలో వార్డు నాయకులు ఎల్లంకి చిన్నమ్మలు, మేడం నారాయణరెడ్డి, మదీనా ఖాన్, బుర్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రంధి గోపి, ఆర్పీలు తదితరులు

### ముగిసిన నాటక పుస్తక ప్రదర్శన

**సీతమ్మధార:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన నాటక పుస్తక ప్రదర్శన సోమవారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమానికి ఆంధ్ర విశ్వకళా పరిషత్ రంగస్థల విభాగానికి సంబంధించిన అధ్యాపకుడు మరపట్ల భాస్కరరావు, రంగస్థల విద్యార్థులు హాజరయ్యారు. భాస్కరరావు మాట్లాడుతూ బాదంగీర్ సాయి దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ నాటక గ్రంథాలయాన్ని స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. జమ్మా చినబాబు, దేవి, వి.రామకృష్ణ, కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గౌరమ్మను దర్శించుకున్న కార్పొరేటర్ విల్లూరి

**అల్లిపురం:** వెంకటేశ్వరమెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త పీల వెంకట అప్పలనాయుడు తదితరులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న విల్లూరి భాస్కరరావు, భీశెట్టి శ్రీను తదితరులు

# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**డాబాగార్డెన్స్:** అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం వేకువజామున 38వ వార్డు ముసలికంటి వారి వీధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామోజీ సత్యవతి(43) సోమవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో నిద్ర లేచి బాత్‌రూమ్‌కి వెళ్లింది. అందులో పడిపోయి మృతి చెందినట్టు సత్యవతి కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ దృష్టికి వెళ్లడంతో, ఆయన స్పందించి ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఘటనా ప్రాంతానికి వెళ్లి విచారణ జరుగుతున్న తీరును గమనించారు. డీసీపీ-2 కె.ఆనంద్‌రెడ్డితో కలిసి మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనుమానాస్పద మృతిగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

### 'జగనన్నకు చెబుదాం'కు 4 వినతులు

**కంచరపాలెం:** జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, యూసీడీకి 01, పబ్లిక్ హెల్త్‌కు 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. వీటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, టీపీఆర్‌వో ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ